నేటి నుంచి డిగ్రీ కళాశాలల బంద్

ఎంజీయూ వీసీకి సమాచారం ఇచ్చిన ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులు

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్లే

7



రాజకీయచైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాయుధ పోరాటం మొదలు స్వరాష్ట్ర సాధన ఉద్యమం వరకు మహిళా నేతలు ఎందరో వారి పోరాటపటిమ చాటి చరిత్రలో నిలిచారు. అలాంటి ఘన చరిత్ర కలిగిన ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న మహిళలు భర్త చాటున మిగిలిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీల్లో సగం మందికిపైగా మహిళా కౌన్సిలర్లు ఉన్నా, వారిలో పట్టుమని పదిశాతం మంది కూడా స్వతంత్రంగా విధులు నిర్వర్తించలేకపోతున్నారు. వారి స్థానాల్లో భర్తలు, కుమారులే వార్డుల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, రాజకీయాల్లో వ్యవహారాలు చక్కబెడుతున్నారు. వారే కౌన్సిలర్లుగా అధికారులు, ఉద్యోగులకు ఆదేశాలిస్తున్నారు. పదవిని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టులు, పైరవీలు, రియల్ ఎస్టేట్ దందాలు జోరుగా సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీల్లో మహిళా కౌన్సిలర్ల క్షేత్రస్థాయి పరిస్థితిని 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా, పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- పురపాలికల్లో నామమాత్రంగా మహిళా కౌన్సిలర్లు
- పెత్తనమంతా భర్త, కుమారులదే
- జిల్లా కేంద్ర మునిసిపాలిటీల్లోనూ అదే తీరు
- ఉమ్మడి జిల్లా పురపాలికల్లో ఇదీ పరిస్థితి

అన్నీ ఆయనే చూసుకుంటారు!

జిల్లా కేంద్రాలుగా ఉన్న మున్సిపాలిటీల్లో సైతం ముగ్గురు, నలుగురు మినహా మిగతా మహిళా కౌన్సిలర్లంతా కౌన్సిల్ సమావేశాలకు, అధికారిక కార్యక్రమాల హాజరుకే పరిమితమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద మునిసిపాలిటీ నల్లగొండలో మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు, కుమారులు పెత్తనం చెలాయిస్తున్నారు. ఇక్కడ 24 మంది మహిళా కౌన్సిలర్లుంటే ఇద్దరు, ముగ్గురు తప్ప మిగతా అందరి పరిస్థితి ఇదే. కొందరు మున్సిపల్ కాంట్రాక్టర్లు వారి భార్యలను ఎన్నికల్లో గెలిపించుకొని, వార్డుల సమస్యలను పట్టించుకోకుండా కాంట్రాక్టులు, పైరవీలు చేస్తున్నారని ప్రచారం ఉంది. మహిళా కౌన్సిలర్లు కనీసం వారి వార్డుల్లో ఉండే ఓటర్లను సైతం గుర్తించలేని పరిస్థితి ఉంది. కౌన్సిలర్ల భర్తలు మునిసిపల్ కార్మికులు, చిరుద్యోగులను బెదిరిస్తూ సొంత వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు.

- సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులకు 29 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు. ఇక్కడ మహిళా కౌన్సిలర్ల భర్తలు, కుమారులు, అధికారులకు ఫోన్లు చేసి వారే కౌన్సిలర్లమని చెబుతూ వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు.
- భువనగిరి మున్సిపాలిటీలో 17 మంది మహిళా కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేవలం అధికారిక కార్యక్రమాలకే వారు పరిమితం కాగా, మిగిలిన వ్యవహారాలన్నీ భర్తల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. ఒక్క వార్డులో మాత్రం మహిళా కౌన్సిలర్ సోదరుడు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. శివారు



ప్రాంతంలోని ప్రభుత్వ భూములు, కాలనీలోని భూముల వ్యవహారాల్లో ఆ కౌన్సిలర్ భర్తనే కీలకంగా మారిన విషయం మున్సిపల్ పరిధిలో చర్చనీయాంశంగా ఉంది. ఆ ప్రాంతంలో భూముల కేటాయింపులు, ఇళ్లస్థలాల కేటాయింపుల్లో ఆయనే కీలకంగా వ్యవహరిస్తున్నారని, రెవెన్యూ అధికారులతో ఆయనకున్న సాన్నిహిత్యంతో ఈ వ్యవహారాలు చక్కబెడుతున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల జరిగిన అవిశ్వాస తతంగంలోనూ ఆయనే కీలకంగా వ్యవహరించానే చర్చ ఉంది. మరో ముగ్గురు కౌన్సిలర్ల భర్తలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చక్కబెట్టుకుంటున్నారు. ఒక కౌన్సిలర్ భర్త ప్రభుత్వ భూమిని ఆక్రమించి తన రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రోడ్డు నిర్మించినట్టు ఆరోపణలున్నాయి. కొందరు కౌన్సిలర్ల భర్తలు మున్సిపల్ వ్యవహారాల్లో మితిమీరిన జోక్యంతో అధికారులు, ఉద్యోగులు పనులు చేయలేని పరిస్థితి కల్పిస్తున్నారనే విమర్శలున్నాయి.

పైరవీల హవా వారిదే

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 26 మంది మహిళా కౌన్సిలర్లు గెలుపొందగా, ఇద్దరు పదవీకాలంలో మృతిచెందడంతో ప్రస్తుతం 24మంది కొనసాగుతున్నారు. అటు వార్డుల్లో, ఇటు మున్సిపల్ కార్యాలయంలో వీరి భర్తలు, కుమారులే చక్రం తిప్పుతున్నారు. వార్డుల్లో ప్రజలు ఇబ్బందులు చెప్పుకోవాలన్నా, వీరినే సంప్రదించాల్సి ఉంటోంది. పట్టణానికి దక్షిణాన ఉన్న ఒక కౌన్సిలర్‌కు కనీస రాజకీయపరిజ్ఞానం, వ్యవహారం తెలియకపోయినా, ఆ వార్డులో ఆమె భర్త, కుమారుడు పెత్తనం చెలాయిస్తున్నారు. ఉత్తరాన ఉన్నమరో వార్డు కౌన్సిలర్ కుమారుడు తన వార్డుతో పాటు పట్టణమంతా తనదే పెత్తనమన్నట్టు వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. మరో కౌన్సిలర్ సుపుత్రుడు వార్డుతో పాటు, మున్సిపల్ కార్యాలయంలో తిష్టవేసి పెత్తనం చెలాయిస్తున్నాడు. పట్టణంలో మహిళా కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహించే వార్డుల్లో మురుగుకాల్వలు శుభ్రం చేసే దగ్గరి నుంచి భవనాల నిర్మాణాలకు అనుమతుల వరకు వారి భర్తలు, కుమారులే చక్కబెడుతున్నారు. సుదీర్ఘ కాలంగా మునిసిపాలిటీపై పట్టుకొనసాగించి కాంట్రాక్టు పనులు నిర్వహించిన నేతలు రిజర్వేషన్లతో వారి భార్యలు, తల్లులను ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించుకోవడం ద్వారా వారి హవానే ఇక్కడ కొనసాగుతోంది. వార్డుల్లో హంగామాతో పాటు, కార్యాలయంలో అధికారులను, ఉద్యోగులను సైతం వీరు బెదిరిస్తున్న పరిస్థితి సర్వసాధారణంగా మారింది. దిగువస్థాయి సిబ్బంది, పారిశుధ్యకార్మికులకు ఈ సూపర్ కౌన్సిలర్లు చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

- దేవరకొండ మునిసిపాలిటీలో 10మంది మహిళా కౌన్సిలర్లు గెలుపొందారు. ఇక్కడ మహిళా కౌన్సిలర్లు సంతకాలకే పరిమితమైతే, వారి భర్తలే వ్యవహారాలు చక్కదిద్దుతున్నారు. కొందరు

- మిగతా 7వ పేజీలో...

9491065747 ఈ నంబర్ ఎప్పుడూ స్విచ్ఛాఫ్

దయచేసి కొంత సమయం తర్వాత ప్రయత్నించండి



నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకొస్తున్న అధికారులు వినియోగదారుల సమస్యల పరిష్కారంలో మాత్రం ఆధునిక పరిజ్ఞానం మాత్రం అందిపుచ్చుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో తలెత్తే అంతరాయాలపై సకాలంలో స్పందించి పరిష్కరించడంలో ఆ శాఖ సిబ్బంది విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు జిల్లాకేంద్రంలోని అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్ ఏడాదిగా మూతపడటంతో వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించే వారే కరువయ్యారు. ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన సెల్ నంబర్ 9491065747 ఎప్పుడూ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో వినియోగదారులు అసహనానికి గురవుతున్నారు. ఫలితంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తి సరఫరా నిలిచిపోతే వినియోగదారులు అధికారులకు, సిబ్బందికి ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయని పరిస్థితి నెలకొంది. వినియోగదారులు సదరు సెక్షన్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని ఏరియాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మూన్నాళ్ల ముచ్చటగానే..

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినప్పుడల్లా వినియోగదారులు సంబంధిత అధికారులు,సిబ్బందికి ఫోన్‌చేయడం, వారు లిఫ్ట్ చేయకపోవడం వంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అప్పట్లో అధికారులు

- మిగతా 8వ పేజీలో...

అంతరాయం ఏర్పడితే తప్పని నిరీక్షణ

నల్లగొండ పట్టణంలో ఏడీఈ కంట్రోల్ మొత్తం సెక్షన్లు పనిచేస్తున్నాయి. వీటిలో టౌన్-1, టౌన్-2, టౌన్-3 ప్రధానంగా ఉన్నాయి. వీటి పరిధిలో గృహ, వాణిజ్య అవసరాల కేటగిరీలకు సంబంధించి సుమారు 85వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో నిత్యం ప్రతీ సెక్షన్‌కు సుమారు 60 నుంచి 70 వరకు వివిధ రకాల ఫ్యూజ్ ఆఫ్‌కాల్స్ ఉంటాయి. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేకంగా ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్ వ్యవస్థ లేకపోవడంతో వినియోగదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక సంబంధిత ఏరియా లైన్‌మన్లకు, ఇతర సిబ్బందికి ఫోన్ చేస్తున్నప్పటికీ కొందరు మాత్రం ఫోన్ లిఫ్ట్ చేయకపోతుండగా, మరికొందరు అధికారులు, సిబ్బంది కుంటిసాకులు చెబుతూ కాలయాపన చేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా సరఫరా పునరుద్ధరణకు నిరీక్షణ తప్పడంలేదు. దీంతో సిబ్బందిలో జవాబుదారీతనం లోపిస్తుంది. జిల్లాకేంద్రంలోనే ఫ్యూజ్ ఆఫ్‌కాల్ వ్యవస్థ ఇలా ఉంటే మరి మారుమూల ప్రాంతాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

న్యూస్ బాక్స్

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఐ నేత పల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దేవరకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల సందర్భంగా నిర్వహించే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి డిసెంబరు 26తో వందేళ్లు పూర్తవుతుందని అన్నారు. ఈ కాలంలో సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించిందన్నారు. ఈ సందర్భంగా డిసెంబరు 30న నల్లగొండ ఎన్జీ కళాశాల గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వలమాల ఆంజనేయులు, మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నూనె రామస్వామి, బుచ్చయ్య, తోటపల్లి నగేష్, మైనొద్దిన్, నీల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో జరిగిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల ముందు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, గంజి మురళి, శంకర్, సైదులు, రమేష్, బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 7వ తేదీ వరకు ప్రభుత్వ పథకాలపై సాంస్కృతిక సారథి కళా బృందాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం ప్రజాపాలన కళా యాత్ర ప్రచార రథాన్ని కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంస్కృతిక సారథి కళాకారులు డిసెంబరు 7వ తేదీ వరకు ప్రతీ రోజు రెండు మేజర్ పంచాయతీలతోపాటు, సంబంధిత మండల కేంద్రాల్లో ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 23న జిల్లా కేంద్రంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల బృందం ఆధ్వర్యంలో 'జయ జయహే.. ప్రజాపాలన' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. డిసెంబరు 4న జిల్లా కేంద్రంలో అంత దూపుల నాగరాజు ఆధ్వర్యంలో 'ప్రజా ప్రభుత్వం పిలిచింది' పేరున జానపద డ్యాన్స్, డ్రామా ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమాలకు మంత్రులతో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. గ్రామాల్లో చేపట్టనున్న కళాజాత కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు ముందుగానే టామ్ టామ్ ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ఇసుక సరఫరా చేయాలి

సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ఇసుకను ఎలాంటి జాప్యం లేకుండా సరఫరా చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. శాలిగౌరారం మండలం వంగమర్తి ఇసుక రీచ్ నుంచి ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఇసుకను ఇచ్చేందుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. అంతేగాక దేవరకొండ మండలం ము దిగొండ ఇసుక రీచ్ నుంచి డిండి, కిష్టరాయన్‌పల్లి ఎత్తిపోతల పథకాలకు లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను గుర్తించి సరఫరా చేసేందుకు ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరిగేషన్ ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై అధికారులు దృష్టి కేంద్రీకరించి ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా మైన్స్‌శాఖ ఏడీ జాకబ్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, యాదవ్, ఎలమంద, డీఐవో వెంకటేశ్వర్లు, టీజీ ఎండీసీ పీవో రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీ.వెల్లెంల ప్రాజెక్టును సందర్శన

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): మండలంలోని బీ.వెల్లెంలలో ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సందర్శించారు. ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారన్న సమాచారం మేరకు ప్రాజెక్టును ఆమె సందర్శించారు. తొలుత పంప్‌హౌస్, సర్జ్‌పూల్‌ను,అనంతరం పంపింగ్ ద్వారా రిజార్వయర్‌లోకి విడుదలవుతున్న నీటిని పరిశీలించారు.ప్రాజెక్టు లక్ష్యం, స్వరూపాన్ని ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి ఆమెకు వివరించారు. నిర్మాణంలో ఉన్న శిలాఫలకం దిమ్మె, హెలీప్యాడ్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట సీఈ అజయ్‌కుమార్, డీఈఈ విరలేశ్వర్, శ్రీనివాస్, జేఈఈలు, ఆర్ఐ తరుణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊశయ్య ఉన్నారు.

ట్రామా కేర్ సెంటర్ ప్రతిపాదిత స్థలాన్ని సిద్ధం చేయాలి

(ఆంధ్రజ్యోతి, కట్టంగూరు): మండలంలోని పామనగుండ్ల గ్రామంలో జాతీయ రహదారి పక్కన ట్రామా కేర్ సెంటర్ నిర్మించే ప్రతిపాదిత స్థలాన్ని చదును చేయాలని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఆదేశించారు. మంగళవారం ఈ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. హైవే నుంచి ట్రామాకేర్ సెంటర్ వరకు బాటను చదును చేయడంతో పాటు భవనం నిర్మించేందుకు స్థలాన్ని చదును చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, మాతృనాయక్, ఆర్ఐ కుమార్‌రెడ్డి ఉన్నారు.




ర్యాగింగ్ సరదా శ్రుతిమించితే..

- భవిష్యత్ విద్యాభ్యాసం ప్రశ్నార్థకం
- తాజాగా నల్లగొండ మెడికల్ కళాశాలలో వెలుగుచూసిన ర్యాగింగ్ ఉదంతం
- భౌతికదాడికి దిగిన విద్యార్థులపై కేసులు నమోదు చేసిన పోలీసులు

6

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టాప్రా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పెన్షనర్ల సమస్యలపై ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేయాలన్నారు. రెండో పీఆర్‌సీని ప్రకటించాలని, నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్ ఉన్న బిల్లులను చెల్లించాలని, నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుంభం సత్తిరెడ్డి, కుకుడాల గోవర్ధన్, ఎడ్ల సైదులు, పాదూరి విద్యాసాగర్‌రెడ్డి, ఎండీ.అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సమర్థంగా సేవలందించాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్



త్రిపురారం స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

త్రిపురారం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమర్థవంతంగా సేవలందించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం త్రిపురారం, నిడమనూరు పోలీస్ స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయల్ 100పై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, జూదం, అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి వాటిని అడ్డుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలుగుతూ, సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది పనితీరు, పరిస్థితులను ఎస్ఐ ప్రసాద్, గోపాల్‌రావును అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాకప్, ఎస్‌హెచ్‌వో రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, హాలియా సీఐ జనార్ధన్, త్రిపురారం ఎస్ఐ ప్రసాద్, నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు, తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్ సరదా శ్రుతిమించితే

ర్యాగింగ్ దురలవాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మరోసారి వెలుగుచూసింది. నల్లగొండ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ చేసిన ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదైన ఉదంతం సర్వత్రా చర్చనీయాంశమైంది. గతంలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉన్న ఈ ర్యాగింగ్ అలవాటు కాలక్రమేణ కనుమరుగు కాగా, మెడికల్ కళాశాలల్లో కొనసాగుతూనే ఉంది. ఎంతో కష్టపడి ఉన్నత లక్ష్యాలతో కళాశాలల్లో చేరిన విద్యార్థులు ర్యాగింగ్ అలవాటుతో చక్కటి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. స్నేహపూర్వకంగా మెలగకపోవడంతో పాటు పెత్తందార్లమాదిరిలా వ్యవహరిస్తుండటం జూనియర్లకు చిరాకు తెప్పిస్తోంది. శ్రుతిమించిన చోట ఫిర్యాదు చేస్తే ఏదో సరదా కోసం చేసిన ర్యాగింగ్ భవిష్యత్ విద్యాభ్యాసాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

● నల్లగొండ మెడికల్ కళాశాలలో వెలుగుచూసిన ర్యాగింగ్ ఉదంతం

● భౌతికదాడికి దిగిన విద్యార్థులపై కేసులు నమోదు చేసిన పోలీసులు



గతంలో జూనియర్లు, సీనియర్లతో కలిసిపోయేందుకు సరదాగా ఆటపట్టించేవారు. అయితే ఇది కాస్తా శ్రుతి మించిపోతుండటంతో అప్పటి ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకున్నాయి. ఈ క్రమంలో చాలాచోట్ల ర్యాగింగ్ మాట వినిపించడం లేదు. అయితే మెడికల్ కళశాల్లో మాత్రం అక్కడక్కడ వెలుగుచూస్తోంది. సీనియర్లు, జూనియర్లను ర్యాగింగ్ చేయడం పరిపాటిగా మారింది. అయితే ర్యాగింగ్ సంఘటనలు జరుగుతున్నా కళాశాల నిర్వాహకులు బయటకు పొక్కకుండా జాగ్రత్తపడుతున్నారు. అటు కళాశాల గౌరవానికి తోడు ఇటు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. అయితే ర్యాగింగ్ విశృంకళంగా మారడంతో సున్నిత మనస్తత్వం కలిగిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్వల్పకాల ఆనందం కోసం ర్యాగింగ్ చేస్తున్న విద్యార్థులు ఆ తర్వాత పరిణామాలను మరిచిపోతున్నారు. ఒక్కోసారి తమ చర్యల వల్ల చక్కటి విద్యాభ్యాసం చేయాల్సిన భవిష్యత్‌ను కోల్పోయే ప్రమాదమూ ఉంది.

సీనియర్ల తీరుతోనే

మెడికల్ కళాశాలల్లో జూనియర్లతో సీనియర్లు స్నేహంగా మెలగడంలేదు. ఏదో ఒక సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రికార్డులు రాయాలని, విద్యకు సంబంధించి పెండింగ్ పని ఉంటే చేసిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో కాలక్షేపం కోసం డ్యాన్సులు చేయాలని, పాటలు పాడాలని జూనియర్లపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే సీనియర్ల చర్యలను జూనియర్లు సరదాగా తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేవు. తమ పట్ల కొంత బాధ్యతగా ప్రవర్తిస్తున్నారనుకుంటే సమస్యల్లేవు. సీనియర్ల రికార్డులు, ఇతర విద్యకు సంబంధించిన పనులు చేయాలని కోరితే జూనియర్లు చేయడం వల్ల విద్యలో రాణించే అవకాశముంది. సీనియర్లతో కలిసిపోతే విద్యకు సంబంధించి వారి నుంచి కొంతమేర నేర్చుకునే అవకాశాలూ లేకపోలేదు. అయితే సున్నితంగా చెప్పాల్సిన పనులు కూడా బెదిరింపులుగా ఉండటంతో జూనియర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళాశాలల్లో విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండేలా వారికి ప్రత్యేక మానసిక నిపుణులతో కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

నాలుగేళ్ల కిందట

నాలుగేళ్ల క్రితం సూర్యాపేట మెడికల్ కళాశాలలో కొందరు విద్యార్థులు ఓ విద్యార్థితో అమర్యాదగా ప్రవర్తించారు. అంతేకాకుండా అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయంలో సంబంధిత బాధిత విద్యార్థి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు కావడంతో పాటు కళాశాల నుంచి కొన్ని నెలల పాటు వారిని సస్పెండ్ చేశారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలు

మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో పోలీస్ అధికారి, సీనియర్ విద్యార్థులు, విద్యార్థినులు, హాస్టళ్ల వార్డెన్లు, వివిధ విభాగాలకు చెందిన 10 మంది హెచ్‌వోడీలు ఉన్నారు. వీరంతా కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సీనియర్ విద్యార్థులతో జూనియర్ విద్యార్థులకు పరిచయ కార్యక్రమం ఏర్పాటుచేస్తారు. ర్యాగింగ్ చేయవద్దని అవగాహన కల్పిస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి సమయంలో ర్యాగింగ్ కమిటీలోని కొంతమంది సభ్యులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి విద్యార్థుల కదలికలను గమనిస్తుంటారు. అదేవిధంగా హాస్టల్ గదుల్లో ఉండాల్సిన సంఖ్య ప్రకారం విద్యార్థులు ఉన్నారా లేరా అనే విషయాలను కూడా గమనిస్తారు. ఒకవేళ ఎవరైనా విద్యార్థిని ఇబ్బందులు పెడుతున్నట్లు గమనిస్తే వెంటనే వారికి కౌన్సెలింగ్ ఇస్తారు.

● సూర్యాపేటలో సత్ఫలితాలిస్తున్న చర్యలు

ర్యాగింగ్‌కు చెక్‌పెట్టేందుకు సూర్యాపేట మెడికల్ కళాశాల నిర్వాహకుల చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం 750 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల ప్రారంభ బ్యాచ్ విద్యార్థులు ఈఏడాది వారి ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేయనున్నారు. కళాశాలలో ఇటీవల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. దీంతో జూనియర్, సీనియర్ విద్యార్థులు కొన్ని నెలల పాటు కలవకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. సీనియర్, జూనియర్ విద్యార్థుల తరగతులు, డైనింగ్ సమయాలు వేర్వేరుగా ఏర్పాటుచేశారు. అంతేకాకుండా సీనియర్, జూనియర్ విద్యార్థులకు హాస్టళ్లు కూడా వేరుగా ఏర్పాటుచేశారు. దీంతో చాలామేరకు ర్యాగింగ్‌ను అరికడుతున్నారు. రాత్రి సమయాల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు హాస్టళ్ల వద్ద నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాయి. వీటికి తోడు విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నా, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా ప్రత్యేకంగా కళాశాలల్లో డ్రాప్ బాక్సును ఏర్పాటుచేశారు. నేరుగా వారి ఇబ్బందులను తెలపలేని విద్యార్థులు డ్రాప్ బాక్సులో ఫిర్యాదులు వేయవచ్చు. దీని ద్వారా కూడా వారి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. కళాశాల్లో విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా హాస్టళ్లు ఉన్నాయి. అదేవిధంగా కళాశాల ప్రాంగణంలోనే ప్రిన్సిపాల్,ఇతర హెచ్‌వోడీలు, అధ్యాపకుల నివాస గృహాలు ఏర్పాటుచేశారు. రాత్రి 9గంటల వరకు విద్యార్థులు వారి హాస్టళ్లకు చేరుకునేలా చర్యలు చేపడుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరం

విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరం. సుప్రీంకోర్టు 2009లో ఇచ్చిన తీర్పు మేరకు 1950 యూజీసీ చట్టం సెక్షన్ 96, సబ్ సెక్షన్(1) ప్రకారం విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు నిషేధం. అయితే ఆకతాయిలైన కొంత మంది సీనియర్ విద్యార్థులు అక్కడక్కడ శ్రుతిమించి ప్రవర్తిస్తున్నారు. అయితే ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులను కళాశాల నుంచి తొలగించాలనే నిబంధన ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సస్పెన్షన్ వరకు మాత్రమే పరిమితం చేస్తున్నారు.

బాధితులు ఫిర్యాదు చేస్తే..

● ర్యాగింగ్ చేసిన వారిపై కఠిన చర్యలకు తీసుకోవచ్చు.
● నెలల పాటు కళాశాలల నుంచి సస్పెండ్ చేయ్యొచ్చు.
● రిమార్కులతో స్టడీకండక్ట్‌ను జారీ చేయొచ్చు.
● కొన్ని సందర్భాల్లో అడ్మిషన్‌ను రద్దు చేసే అవకాశమూ లేకపోలేదు.



ర్యాగింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు

కళాశాలల్లో ర్యాగింగ్‌కు అవకాశం లేకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నాం. సీనియర్, జూనియర్ విద్యార్థులు కొన్నాళ్ల పాటు కలవకుండా చర్యలు తీసుకున్నాం.తరగతి,డైనింగ్ సమయాలు వేర్వేరుగా ఏర్పాటుచేశాం. జూనియర్ విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టల్‌లో ఒక ఫ్లోర్‌ను కేటాయించాం. ర్యాగింగ్ సంఘటనలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నాం. వాట్సాప్, ఈమెయిల్, డ్రాప్ బాక్సు ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాం. యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారు.

డాక్టర్ ఎం.జయలత, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూర్యాపేట.

నల్లగొండ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం

నల్లగొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో తొలిసారి ర్యాగింగ్ కలకలం చెలరేగింది. ఎన్నడూ లేని విధంగా ర్యాగింగ్ భూతం కళాశాల విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తోంది. నెల రోజులుగా కళాశాలలో ర్యాగింగ్ జరుగుతున్నా, జూనియర్ విద్యార్థులు బయటికి చెప్పుకోలేకపోయారు. అయితే సీనియర్ల ర్యాగింగ్ రోజురోజుకూ శృతిమించింది. ప్రధానంగా తెలుగురాని ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులను సీనియర్లు టార్గెట్ చేసినట్లు సమాచారం.

రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2019లో నల్లగొండలో ప్రభుత్వం వైద్య కళాశాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ ఏటా 150మంది విద్యార్థులు అడ్మిషన్ పొందుతున్నారు. ఆల్ ఇండియా కోటాలో 15శాతం మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ కోటా కింద ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్ పొందుతున్నారు. కళాశాల ప్రారంభమైన ఆరేళ్లలో మొదటిసారి ర్యాగింగ్ భూతం వెలుగుచూసింది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వైద్యకళాశాలకు చెందిన మెన్స్ విద్యార్థుల హాస్టల్‌లో కొద్ది రోజులుగా సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారు. కొందరు సీనియర్లు మద్యం మత్తులో జూనియర్లను వేధింపులకు గురి చేసినట్లు వినికిడి. కేరళ రాష్ట్రానికి చెందిన జూనియర్ విద్యార్థులను అసభ్య పదజాలంతో పిలవడంతోపాటు వారిని మానసి వేదనకు గురిచేసినట్లు సమాచారం. తాము చెప్పినట్లు నడుచుకోవాలని, తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని జూనియర్లను, సీనియర్లు హెచ్చరించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే సీనియర్ల వేధింపులను తట్టుకోలేక ఓ విద్యార్థి ఫిర్యాదు చేయడంతో ర్యాగింగ్ చేసిన వారిపై ఈనెల 11వ తేదీన నల్లగొండ వన్‌టౌన్ స్టేషన్‌లో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రు ఫిర్యాదు చేశారు. 11వ తేదీన సాయంత్రం 7గంటల సమయంలో మెడికల్ కళాశాల హాస్టల్ సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేయడంతోపాటు భౌతికంగా దాడి చేసినట్లు ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకునేందుకు పోలీసులు నిర్ణయించారు. బీఎన్ఎస్ సెక్షన్‌తో పాటు ర్యాగింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మొత్తం ఐదుగురు సీనియర్లపై చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, సీనియర్ల ర్యాగింగ్‌తో కొంత మంది విద్యార్థులు సెలవు పెట్టి సొంత ప్రాంతాలకు వెళ్లినట్లు సమాచారం.



దేదీప్యమానం.. ఎల్లమ్మ అలంకారం

కనగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం మంగళగౌరిదేవిగా దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలను సమర్పించారు. విద్యుద్దీపాలతో అమ్మవారి మండపాన్ని సుందరంగా అలంకరించారు.



ఆదమరిస్తే.. అంతే సంగతులు

కొండమల్లేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పత్తి ఏరేందుకు గ్రామాల నుంచి కూలీలను ఆటోల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఒక్కో ఆటోలో 25 నుంచి 30 మందిని ఎక్కిస్తున్నారు. మంగళవారం కొండమల్లేపల్లిలో కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ఆటో.



పరుగు పందేనికి మేము సైతం

భానుపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ చిత్రంలో ఉత్సాహంగా పరుగెడుతున్న బాలురంతా దివ్యాంగులు.. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో ఉత్సాహంతో పరుగెడుతున్న దివ్యాంగులు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సంక్షేమాధికారి కె.నరసింహారావు, సీడీపీవోలు, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక

నాగార్జునసాగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-14, 17 నెట్ బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, హెచ్‌ఎం సిస్టర్ లలితలు తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామని వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అండర్-14 బాల, బాలికలు 2011 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, అదేవిధంగా అండర్-17 విభాగంలో పాల్గొనదలచిన బాల, బాలికలు 2008 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు ఒరిజినల్ బోనోఫైడ్ సర్టిఫికెట్ తీసుకుని రావాలన్నారు. పూర్తి వివరాలకు 916049743 ఫోన్‌నెంబరును సంప్రదించాలని కోరారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థికి సన్మానం

చింతపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని వింజమూర్ గ్రామానికి చెందిన అలంపల్లి కిషన్ కుమార్తె తేజస్వీని నేషనల్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. తేజస్వీని జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతోంది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బాలికను సన్మానించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగనున్న పోటీల్లో పాల్గొనడానికి ఖర్చుల నిమిత్తం రూ.17 వేలు అందజేశారు. సన్మానించిన వారిలో వందనపు ఆంజనేయులు, చెట్లపల్లి హరిప్రసాద్, సముద్రాల నగేష్, కర్నాటి శ్రీనివాస్, అగిరురవి, దాచేపల్లి మధు, కొమిరి శెట్టి వినోద్, ఆకారపు శ్రీకాంత్, తేరటిపల్లి నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.



తేజస్వీని సన్మానిస్తున్న చింతపల్లి ఆర్యవైశ్యులు

మీకు తెలుసా

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామానికి ఆ పేరెలా వచ్చిందో తెలుసుకుందాం.. మాధవుడు పరిపాలించిన గ్రామం కావడంతో మాధవ అని మరియు గ్రామంలో యాదవులు ఎక్కువగా ఉండటం వల్ల యాడవల్లి అని పేరు వచ్చింది. గ్రామంలో గంగదేవమ్మగుడి ఉంది. ఈ దేవత యాదవుల కులదేవతగా చెబుతారు. ప్రతి ఏడాది ఇక్కడ జాతర పెద్దఎత్తున చేస్తారు.

పీఏసీఎస్ చైర్మన్ల అధ్యయన యాత్ర

● 24 నుంచి 29 వరకు కర్ణాటకలో పర్యటన ● పీఏసీఎస్‌ల నిర్వహణ, అభివృద్ధిపై క్షేత్రస్థాయి పరిశీలన

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) చైర్మన్లు అధ్యయన యాత్రకు వెళ్లనున్నారు. ఈ నెల 24 నుంచి 29 వరకు కర్ణాటక రాష్ట్రంలో వారు పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24న సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి 25 ఉదయం బెంగళూరుకు చేరుకుంటారు. అదే రోజు కూర్గు, రాజాస్ట్రీట్‌లతో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తారు. 26న మెడికేరి, దుబేరి, ఎలిఫెంట్ క్యాంపు, 27న మైసూర్, బృందావన్ గార్డెన్, 28న శ్రీరంగపట్నం, చాముండీ హిల్స్ సందర్శించి అదే రోజు సాయంత్రం బెంగళూరు నుంచి తిరిగి సికింద్రాబాద్‌కు రైలులోనే బయలుదేరి 29న ఉదయం సికింద్రాబాద్‌కు చేరుకునేలా షెడ్యూల్‌ను డీసీసీబీ అధికారులు ఖరారు చేశారు.



పర్యటన ఉద్దేశం

కర్ణాటక రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండటం అక్కడ పీఏసీఎస్‌ల నిర్వహణ, రైతు అవసరాలను తీరుస్తూ అవి ప్రగతిబాటలో కొనసాగుతున్న తీరును చైర్మన్లు స్వయంగా అధ్యయనం చేయనున్నారు. పీఏసీఎస్‌లకు నిధుల సమీకరణ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల పంపిణీ ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం సంఘం ద్వారా రుణాలు ఇచ్చే విధానం, రికవరీ పద్ధతులను వారు ఈ పర్యటనలో తెలుసుకోనున్నారు. కేంద్రం పీఏసీఎస్‌లను మల్టీపర్పస్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ప్రకటించిన నేపథ్యంలో సంఘాల నిర్వహణపై మరింత అవగాహన కోసమే ఈ అధ్యయన యాత్రకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించారని చైర్మన్లు చెబుతున్నారు. కర్ణాటకలో లాభాల బాటలో నడుస్తున్న సంఘాలను సందర్శించి అవి అభివృద్ధి పథంలో కొనసాగడానికి చేపట్టిన సంస్కరణలు తదితర అంశాలను పరిశీలించి తెలంగాణలోనూ అదే మాదిరి విధానాన్ని అమలుపర్చే ఉద్దేశంతో ఈ అధ్యయన యాత్రకు చేపడుతున్నట్లు తెలుస్తుంది.

ఈ టూర్ మాకు ఎంతో ఉపకరించనుంది



కర్ణాటక రాష్ట్రంలో చేయనున్న ఎడ్యుకేషనల్ టూర్ మాకు ఎంతో ఉపకరిస్తుంది. ఆ రాష్ట్రంలో సహకార వ్యవస్థ నిర్వహణ తీరును మేం స్వయంగా తెలుసుకోగలిగే సదావకాశం. ఈ ఎడ్యుకేషనల్ టూర్ ద్వారా అక్కడి సహకార వ్యవస్థ నిర్మాణం, నిర్వహణలో వ్యత్యాసాన్ని, పద్ధతులను తెలుసుకోగలుగుతాం. సంఘ బలోపేతానికి దోహదపడే విధానాలను ఇక్కడ అమలుచేయగలిగే పరిస్థితులపై అవగాహన చేసుకుంటాం.

కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నార్కట్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో భిక్షాటన చేస్తూ గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి బస్టాండ్‌లో జరిగింది. సుమారు 45 సంవత్సరాలు వయసున్న వ్యక్తి భిక్షాటన చేస్తుండేవాడు. ఈ నెల 18వ తేదీన నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా ప్రయాణికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని నార్కట్‌పల్లి పోలీసులు సూచించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

దేవరకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో మంగళవారం పట్టపగలే రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. పట్టణంలోని హనుమాన్‌నగర్, ఎంకేఆర్ కళాశాల రోడ్డులో రెండు ఇళ్లలో ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న శీనునాయక్ హోండా షోరూంలో పనిచేస్తుంటాడు. భార్య ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తోంది. ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లగా దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి శీనునాయక్ ఇంట్లో రూ.50వేల నగదు, దుస్తులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఎంకేఆర్ కళాశాల రోడ్డులో నివాసముంటున్న మంగ్యానాయక్ ఇంటి తాళాలు పగలగొట్టి రూ.2లక్షల 50వేల నగదు, రెండు తులాల వరకు బంగారు వస్తువులను దొంగలు అపహరించారు. మంగ్యానాయక్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. అదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న దేవరకొండ సీఐ నర్సింహులు దొంగతనాలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 16న అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న భీమనపల్లికి చెందిన రేషన్ డీలర్ మునుకుంట్ల విష్ణువర్ధన్‌రెడ్డి మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లాడు. అదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి నగదుతోపాటు బంగారం, వెండి ఆభరణాలు అపహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




చికిత్స పొందుతూ మృతిచెందిన తంబి

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రివిద్యుత్ స్టేషన్‌లో వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తున్న వ్యక్తి సోమవారం రాత్రి అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైచికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం రూరల్ ఎస్‌ఐ లోకేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా, నందివాడ మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన గోగులముడి తంబి(40) కొంతకాలంగా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న వైటీపీఎస్‌లో వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తూ వాడపల్లి రాశి ఫ్యాక్టరీకాలనీ నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి అత్యవసర పనినిమిత్తం తన స్కూటీపై మిర్యాలగూడకు బయలుదేరాడు. మార్గమధ్యలో అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై గూడూరు గ్రామశివారులో ఎలాంటి పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా అజాగ్రతతో నిలిపిఉన్న మినీట్రాలీ ఆటోను గమనించక ఢీ కొట్టాడు. దీంతో తంబి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం కుటుంబసభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తంబికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యం.. కేసు నమోదు

పాలకవీడు, నవంబరు19: (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న 99మందిపై కేసు నమోదు చేసినట్లు ఆ సంస్థ విజిలెన్స్ డీఈ స్వామి తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మీటర్ లేకుండా విద్యుత్ తీగలు అక్రమంగా తగిలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటోమొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం



దగ్ధమైన ఆటో మొబైల్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ఓ ఆటోమొబైల్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. చిట్యాల ఆటో నగర్‌లోని మల్లిఖార్జున ఆటోమోబైల్ దుకాణం నుంచి సోమవారం అర్ధరాత్రి దట్టమైన మంటలు రావడంతో మెకానిక్‌లు గమనించి పక్కనే ఉంటున్న షాప్ యజమానికి సమాచారం అందించారు. ఆయన అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా మంటలు ఆర్పినప్పటికీ అప్పటికే దుకాణం పూర్తిగా దగ్ధమైంది. అగ్ని ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు బాతుక శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఈ నెల 23న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు బట్టు రాంచంద్రయ్య కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో మంగళవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతి ఐక్యతను చాటాలని దీనికోసం గ్రామాల వారీగా తరలిరావాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, నాగారం అంజయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, బర్రె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ ఆయనే చూసుకుంటారు!

(5పేజీ తరువాయి)

కౌన్సిలర్ల భర్తలు పైరవీలకే పెద్దపీట వేశారు. కార్యాలయానికి అధికారులు, ఉద్యోగుల కంటే ముందే వచ్చి రోజువారీ ఉద్యోగుల వ్యవహారాల్లోనూ వీరి జోక్యం మితిమీరడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు ఏదైనా పని నిమిత్తం, ఫిర్యాదుల నిమిత్తం వచ్చినా కమిషనర్‌ను, ఇతర ఉద్యోగులను కలవకుండా వీరే సమాధానం చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ చైర్మన్‌పైనా, కమిషనర్‌పైనా ఒత్తిడి తెస్తూ సొంతపనులకే ప్రాధాన్యమిస్తున్నారని వాపోతున్నారు. వీరి మితిమీరిన జోక్యంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

● చిట్యాల మున్సిపాలిటీలో ఆరుగురు మహిళా కౌన్సిలర్లు గెలుపొందారు. ఈ ఆరుగురు కేవలం సమావేశాలకే పరిమితం. వారి భర్తలే కౌన్సిలర్లుగా చలామణి అవుతున్నారు. కౌన్సిల్‌లోనూ, తీర్మానాల సందర్భాల్లోనూ వారి భర్తలు ఆదేశిస్తేనే వీరు సంతకాలు పెడుతున్నారు. నలుగురు మహిళా కౌన్సిలర్ల భర్తలు వార్డుల్లో ప్రజాసమస్యలు వదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పలుకుబడిని వినియోగించుకుంటుండడం గమనార్హం.

● నందికొండ మునిసిపాలిటీలో ఆరుగురు మహిళా కౌన్సిలర్లలో ఒకరు మృతిచెందగా, ప్రస్తుతం ఐదుగురే ఉన్నారు. ఇక్కడా మహిళా కౌన్సిలర్లు నామమాత్రంగానే ఉండగా, వారి భర్తలు, కుమారులే పెత్తనం చెలాయిస్తున్నారు. గతంలో చైర్‌పర్సన్‌గా మహిళ పనిచేసినా ఆమె స్థానంలో నిర్ణయాలు, పనులన్నీ ఆమె భర్త, మామ చక్కబెట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు.

● హాలియా మున్సిపాలిటీలోనూ ఆరుగురు మహిళా కౌన్సిలర్లున్నారు. ఇక్కడ సైతం భర్తలే రాజకీయాలు నిర్వహిస్తున్నప్పటికీ పరిపాలనలో, ఉద్యోగుల వ్యవహారాల్లో వారి జోక్యం పరిమితంగానే ఉంటోంది.

● నకిరేకల్ మున్సిపాలిటీలో 12 మంది మహిళా కౌన్సిలర్లున్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కూడా మహిళలే అయినా, ఇక్కడ మహిళా కౌన్సిలర్లు స్వతంత్రంగా పనులు చక్కబెట్టలేని పరిస్థితి ఉంది. భర్తల కనుసన్నల్లోనే మున్సిపాలిటీలో పనులు, వ్యవహారాలు కొనసాగుతున్నాయి. కొందరు మహిళా కౌన్సిలర్లకు అసలు వార్డుల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ముగ్గురు మహిళా కౌన్సిలర్ల భర్తలు వారి పలుకుబడితో కాంట్రాక్టర్లతో సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తూ వ్యవహారాలు చక్కబెట్టుకుంటుండడం చర్చనీయాంశంగా మారింది.

కుర్చీకే పరిమితమైన కౌన్సిలర్లు

తిరుమలగిరి మునిసిపాలిటీలో తొమ్మిది మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు. వీరు కేవలం సమావేశాలు, అధికారిక కార్యక్రమాలకే పరిమితమైతే, మిగిలిన వ్యవహారమంతా వారి భర్తలే చక్కబెడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి ఈ మునిసిపాలిటీని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసింది. ఆయా వార్డుల్లోని మహిళా కౌన్సిలర్ల భర్తలు తరతమ భేదాల్లేకుండా కమీషన్లు డిమాండ్ చేసి మరీ వసూలు చేయడం అప్పట్లో తీవ్రస్థాయిలో దుమారం రేపింది. కొందరు కౌన్సిలర్ల ఇళ్ల ముందు లబ్ధిదారులు ధర్నా కూడా చేశారు. భర్తలు, కుటుంబ



సభ్యుల పెత్తనానికి విసిగివేసారిన మున్సిపల్ కమిషనర్ సైతం బదిలీ చేయించుకొని వెళ్లిపోయారనే చర్చ నాడు సాగింది.

● హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 14వార్డుల్లో మహిళలు కౌన్సిలర్లుగా గెలిచినా, వారిలో ఒకరిద్దరు మినహా మిగిలినవారంతా కుర్చీలకే పరిమితమయ్యారు. వీరి భర్తలు, కుమారులే కౌన్సిలర్లుగా కార్యాలయాల్లో, రాజకీయ వ్యవహారాలు చూస్తున్నారు. కొందరు కౌన్సిలర్ల భర్తలు రౌడీయిజం చేస్తూ, దాడులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కౌన్సిలర్ల భర్తలే అధికారిక కౌన్సిలర్లుగా మారి ఏకంగా అధికారికంగా బర్త్‌డే వేడుకలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. వార్డుల్లో రూ.20లక్షల లోపు పనులన్నీ మహిళా కౌన్సిలర్ల భర్తలే స్వయంగా చేస్తున్నారు.

● కోదాడ మునిసిపాలిటీలో 18 మంది మహిళా కౌన్సిలర్లుంటే వారిలో ఇద్దరు మహిళా కౌన్సిలర్లు స్వతంత్రంగా పనిచేస్తుంటే, మిగిలిన 16 మంది స్థానంలో భర్తలు, కుమారులు పెత్తనం చెలాయిస్తున్నారు. పనుల నిర్వహణ మొదలు, పైరవీల వరకు ఏదైనా కౌన్సిలర్ల స్థానంలో వారి కుటుంబీకులే చక్కబెడుతున్నారు.

● నేరేడుచర్ల మునిసిపాలిటీలో ఏడుగురు మహిళ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తుంటే, ఆరుచోట్ల వారి భర్తలు, ఒక్కచోట కౌన్సిలర్ కుమారుడు వ్యవహారాలు నిర్వహిస్తున్నాడు. ఈ మునిసిపాలిటీ కొత్తగా ఏర్పాటవడంతో పెద్దగా పనులేవీ సాగలేదు. ఇటీవల మంత్రి చొరవతో కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల పనులు నిర్వహిస్తున్నారు.

● యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో ఏడుగురు మహిళా కౌన్సిలర్లున్నా, వారిలో ఒకరిద్దరు మినహా మిగిలినవారంతా కేవలం సంతకాలకే పరిమితమయ్యారు. వార్డుల్లో, మున్సిపల్ కార్యాలయంలో, పనుల నిర్వహణలో, రాజకీయాల్లోనూ వారి భర్తలే పెత్తనం చలాయిస్తున్నారు. మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తల పోరు తట్టుకోలేకపోతున్నామని మున్సిపల్ ఉద్యోగులు వాపోతున్న పరిస్థితి నెలకొంది.

● మోత్కూరు మునిసిపాలిటీలో చైర్‌పర్సన్ సహా ఏడుగురు కౌన్సిలర్లు మహిళలే. అయితే వీరు కేవలం సమావేశాలకే పరిమితం కాగా, పనులన్నీ వారి కుటుంబీకులు చూసుకుంటున్నారు. వార్డుల్లో సమస్యలేమైనా ఉన్నా కౌన్సిలర్ల భర్తలకే చెప్పుకోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులతో, ఉద్యోగులతోనూ కౌన్సిలర్ల భర్తలే ఫోన్లలో, కార్యాలయాల్లో మాట్లాడి పనులపై ఆదేశాలు, సూచనలు చేస్తున్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.122	190	220
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.120	174	194

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.60
టీఎంసీలు	296.2810
ఎడమకాల్వకు నీటి విడుదల	5367
కుడికాల్వకు	7381
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24.00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	15.448 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.25 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.56 అడుగులు
టీఎంసీలు	4.35
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	381.82 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	196.44 క్యూసెక్కులు

నేటి నుంచి డిగ్రీ కళాశాలల బంద్

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 65 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ● ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్‌కు యాజమాన్యాల వినతి



ఎంజీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు



మోత్కూరులో కళాశాల గేటుకు కట్టిన బ్యానర్

నల్లగొండ, మోత్కూరు, భువనగిరి గంజ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడు విద్యా సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మరోసారి కళాశాలల నిరవధిక బంద్‌కు నిర్ణయించాయి. రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు (ఆర్టీఎఫ్) బకాయిల కోసం అక్టోబరు 14నుంచి 17వ తేదీ వరకు కళాశాలలు మూసివేశాయి. రాష్ట్ర ఎడ్యుకేషన్ సెక్రటరీ బుర్ర వెంకటేశం తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి త్వరలోనే ఫీజులను విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో కళాశాలల బంద్ విరమించారు. రెండు నెలలు గడుస్తున్నా ఆర్టీఎఫ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ నెల 20వ తేదీ నుంచి కళాశాలలు బంద్ చేయాలని యాజమాన్యాలు నిర్ణయించాయి. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సుమారు 65 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను బుధవారం నుంచి మూసివేయనున్నారు. ఈ నెల 21 నుంచి డిగ్రీ-3, 5వ సెమిస్టర్ పరీక్షలు కూడా బహిష్కరించాలని సంఘం నిర్ణయించుకున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రతినిధులు మంగళవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అల్తాఫ్‌హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి కళాశాలల మనుగడను కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సైదారావు, ప్రవీణ్, రాంమోహన్, సత్యంగౌడ్, వెంకట్‌రెడ్డి, శంకర్, రాజశేఖర్‌రెడ్డి, శంకరయ్య, సత్యం, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులోని శ్రీసంతోష్ డిగ్రీ కళాశాల గేటుకు మంగళవారం సాయంత్రం బ్యానర్ కట్టారు.

గురుకుల విద్యార్థికి పాముకాటు

● నల్లగొండ జిల్లాలో ఘటన ● చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థి



చికిత్స పొందుతున్న విద్యార్థి గణేష్

కేతేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో గురుకుల పాఠశాల విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. మంగళవారం సాయంత్రం కేతేపల్లి మండలంలోని మూసీ బాలుర గురుకుల పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. విద్యార్థి బంధువులు, పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన బద్దం చంద్రశేఖర్, అనితల కుమారుడు గణేష్ ఆరో తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు వద్ద గల బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఏడాది ఏడో తరగతిలో చేరాడు. మంగళవారం సాయంత్రం 5.50 గంటల వరకు తోటి విద్యారులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆటలు ఆడారు. ఆ తర్వాత గణేష్ మరుగుదొడ్డికి వెళ్లి వస్తున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. భయాందోళనతో గణేష్ కేకలు వేయడంతో పాఠశాల విద్యార్థులు, పాఠశాల సిబ్బంది 6.10గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న గణేష్ తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గణేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు బుధవారం ఉదయం డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ చెప్పారు. చికిత్స పొందుతున్న విద్యార్థి గణేష్‌ను ఎంఈవో ఆకవరం రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే వీరేశం సతీమణి వేముల పుష్పక్క, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కుమార్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్‌లు పరామర్శించారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం దళార్చనలు, నృసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతభిషేకం చేసిన అర్చకులు సింధూరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి 1001 తమల పాకులతో ఆంజనేయుడికి సహస్ర నామ పఠనాలతో నాగవల్లీ దళార్చనను పురోహితులు భార్గవచార్యులు, ఆలయ అర్చకులు ప్రశాంత్‌కుమారాచార్యులు ఆంజనేయస్వామివారికి పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభూవులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, సీతారామచంద్రస్వామి వసంతోత్సవాలు శైవగమ పద్ధతిలో కొనసాగాయి. కార్తీక మాసం సందర్భంగా 300 జంటలు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం విష్ణుపుష్కరిణి కొండపైన శివాలయంలోని ఆంజనేయ స్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.6,19,680ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఏవో భాస్కర్‌రావు తెలిపారు.

పద్మశాలి డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి డెవలప్‌మెంట్ అథారిటీని వెంటనే ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యతోకలిసి మంగళవారం బీసీ కమిషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటుకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. ఏటా గ్రాంట్ రూ.200 కోట్లు కేటాయించాలన్నారు. పద్మశాలీలు అన్ని రంగాల్లో ఎదుగుదలకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. ఉపాధి కోసం అప్పు, రుణ సాయం అందించాలని కోరారు. చేనేత కార్మికులకు పద్మశాలి యువకుల ఉపాధి కల్పనకు ఓన్ యువర్ ఆటో, ఓన్ యవర్‌క్యాబ్, ఓన్యూవర్ లారీ, బస్, ఓన్ యువర్ లూమ్, ఓన్‌యువర్ హౌజ్, స్కీములు, హౌజింగ్ కాలనీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. చేనేతలకు ముఖ్యంగా బీసీ వర్గాలకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

అంతర్రాష్ట్ర బియ్యం సరఫరా ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని వాహనంలో అర్ధరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటించి దందాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన మందపాటి నర్సింహారావు, అదే గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య రేషన్ బియ్యం దందా చేస్తుంటారు. వారి కదలికపై పోలీసులు రెండు నెలలుగా నిఘా ఉంచి వాడపల్లి వద్ద మంగళవారం అరెస్టు చేశారు. దామరచర్ల మండలం బడావత్‌తండాకు చెందిన బడావత్ సర్దార్, మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహన డ్రైవర్ దేవరకొండ అమరయ్య, హమాలీ ముఠామేస్త్రీ సైదారావుతో కలిసి బియ్యం దందా కొనసాగిస్తున్నారు. దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులనుంచి రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.10కి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెల గ్రామాల్లో తిరిగి సేకరించిన బియ్యాన్ని ఏపీ 39యూఎఫ్ 8418నెంబర్‌గల అశోక్‌లీల్యాండ్ మినీగూడ్స్ వాహనం ద్వారా రాష్ట్ర సరిహద్దు దాటించేవారు. ఆ వాహనంలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న క్రమంలో అక్టోబరు 24వ తేదీన దామరచర్ల గ్రామ శివారులోని నర్సాపురం ఎక్స్‌రోడ్డు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హమాలీ షేక్ నాగులు మృతిచెందగా, మరికొంతమందికి గాయపడ్డారు. వాడపల్లి పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ అమరయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో రేషన్ బియ్యం రవాణా దందా వెలుగులోకి వచ్చి, నిందితుల వివరాలు బయటపడినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన నర్సింహారావు, లింగయ్యను అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై వాడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 8క్రిమినల్ కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలి పారు. ఈ దందాలో స్థానికంగా మరికొందరి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని, నిందితుల ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా సూత్ర, పాత్రధారులను గుర్తించి త్వరలో అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

మరో బియ్యం వ్యాపారిని అరెస్ట్

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంగా రేషన్‌బియ్యం రవాణాకు పాల్పడుతున్న ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెంటచింతలకు చెందిన బియ్యం వ్యాపారి తిప్పబత్తుల వెంకటనారాయణ అలియాస్ నారాయణ నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లికి చెందిన రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తితో కలిసి రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం బాల్నేపల్లి గ్రామశివారులో శిథిలావస్థలో ఉన్న ఓ ఇంట్లో నిల్వచేసిన సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేపట్టగా బియ్యాన్ని రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తి సేకరించి డంప్ చేసినట్లు తేలింది. వ్యాపారి వెంకటనారాయణ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ముఠాసభ్యులతో బియ్యాన్ని సేకరించి ఏపీకి చెందిన అంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావుల సహకారంతో ఏపీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్క కుండా పరారీలో ఉన్న బియ్యం వ్యాపారి వెంకటనారాయణను అడవి దేవులపల్లి వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిసారు. రెండు కేసుల్లో ప్రధాన నిందితులకు సహకరించిన వ్యక్తులను గతంలో అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏపీ రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రధాన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి, అడవిదేవులపల్లి ఎస్ఐలు హరికృష్ణ, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయి ంచి, రైస్ మిల్లులకు పంపించాలని, ధాన్యం అన్‌లోడింగ్ వెంటవెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

మర్రిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమగ్ర సర్వేను త్వరగా పూర్తి చేయాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి సూచించారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఇంటింటి కుటుంబ సర్వే సూపర్‌వైజర్లతో సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని సూపర్‌వైజర్లకు సూచించారు ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, సురేష్, సూపర్‌వైజర్లు ఉన్నారు.

సింగరాసిపల్లిలో పశు వైద్య శిబిరం

పెద్దఅడిశర్లపల్లి,నవంబర్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని సింగరాసిపల్లిలో మంగళవారం నిర్వహించిన గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి తగిన చికిత్స చేశారు. కార్యక్రమంలోమండల పశువైద్యాధికారి డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ చంద్రబాబు, నడ్డి బాల రాజు యాదవ్, నరేష్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలి : సీపీఐ

డిండి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి ఇచ్చినమాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. మంగళవారం నిజాంనగర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై సీపీఐ నిత్యం పోరాడుతున్నది. సమావేశంలో సీపీఐ డిండి మండల కార్యదర్శి కనకచారి, ఎండీ షైనొద్దిన్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

దేవరకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలు, వృద్ధులు చలికి ఇబ్బందులుపడుతున్నందున దుపట్లు పంపిణీ చేసి నట్లు క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి ప్రభాకర్, గాజుల రాజేష్, శ్రీనివాసులు, మల్లయ్య పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయికి నివాళి



మిర్యాలగూడలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, కొండమల్లేపల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. మిర్యాలగూడలో ఆ సంఘం జిల్లా సంఘటన కార్యదర్శి రాపాక సాయికుమార్ మాట్లాడుతూ నేటి యువతకు ఝాన్సీలక్ష్మీబాయి జీవిత స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ సంధ్యారాణి, మధుమోహన్‌రాజు, కీర్తి, ప్రణవి, మల్లీశ్వరి, ప్రియాంక పాల్గొన్నారు. కొండమల్లేపల్లిలో సాయి ప్రకాష్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో లక్ష్మీబాయి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి చేపూరి కార్తీక్ శిరీష, సంతోష, జయంత్, అర్జున్, అభిలాష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయాలి

కనగల్. నవంబరు 19: (ఆంధ్రజ్యోతి) నల్లగొండ పట్టణంలో ఈనెల 23న నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మాదిగల గ్లోబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల తులసీదాస్, కందుల మోహన్‌మాదిగ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వాహించి ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు మాలలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అంతకుముందు డాక్టర్ అంబేడ్కర్ విగ్ర హానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెరిక అంజయ్య, దుబ్బసత్యనారయణ, ఎర్రోల శ్రీను, దుబ్బదేవేందర్, కొండల్, పెరిక శ్రీను, సైదులు, లింగయ్య, మల్లేష్ తదితరులున్నారు.

చేదోడు వాదోడుగా..

▸▸ కుటుంబానికి అండగా నిలుస్తోన్న పొదుపు సంఘం మహిళలు ▸▸ సొంతంగా వ్యాపారాల నిర్వహణ



నల్లగొండలో బీటీఎస్‌స్వీట్లు తయారు చేస్తున్న కరిష్మా సంఘం మహిళలు



పచ్చళ్లు విక్రయిస్తున్న మహిళ

ప్రభుత్వం అందిస్తోన్న రుణాలు సద్వినియోగం చేసుకోని ఆర్థిక స్వావలంబన దిశగా ప్రయత్నిస్తున్నారు నల్లగొండ పట్టణంలోని పొదుపు సంఘాల మహిళలు. వారు ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధిని కల్పిస్తున్నారు.

నల్లగొండ రూరల్, నవంబరు19(ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వశక్తిగా ఎదగాలని ఇందిరా క్రాంతి పథకం ద్వారా పొదుపు సంఘ సభ్యులకు ప్రభుత్వం రుణాలను అందజేస్తోంది. మహిళలు ఈ రుణాలను సద్విని యోగం చేసుకొంటూ కొందరూ సొంతంగా వ్యాపారం నిర్వహించడంతో పాటు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసు కుంటూ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు. నల్లగొండ పట్టణంలో సుమారు 500 మంది పైగా మహిళా పొదుపు సంఘాలుఉన్నాయి. వీటి కొన్ని రూ.లక్ష నుంచి 4 లక్షల వరకు రుణాలు తీసుకొని పచ్చళ్ల తయారీ, పిండి వంటలు, కుట్టు మిషన్లు వంటి చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వారు మరో ఇద్దరు ముగ్గురికి ఉపాధి అవకాశం కూడా కల్పిస్తున్నారు. ఈక్రమంలోనే నల్లగొండ పట్టణంలోని బోయవాడలో భవా ని పొదుపు సంఘ సభ్యులైన కట్ట హేమలత, పల్లటి విజ య చేరో రూ.2లక్షలు రెండు నెలల క్రితం రుణం తీసు కున్నారు. రుణంతో పచ్చళ్లు తయారు చేసి వివిధ ప్రాంతా ల్లో విక్రయిస్తున్నారు.

అలాగే బీటీఎస్, రహమత్ నగర్‌లో కరిష్మా మహిళా స్వశక్తి పొదుపు సంఘ సభ్యురాలైన మరియం సాదియా, మునిరా బేగం పొదుపు సంఘంలో రూ.3 లక్షల రుణం తీసుకొని పిండి వంటలు తయారీలు చేస్తున్నారు. వీటిని వారి కుటుంబ యజమాని సహకారంతో జిల్లాలోని వివిధ స్వీట్‌హౌస్, కిరాణం దుకాణాలకు సరఫరా చేస్తూ వ్యాపారాలు నిర్వహిం చుకుంటున్నారు. ప్రభుత్వం మరింత సహకారం చేస్తే తమ వ్యాపారాలను మరింత విస్తరించడంతో పాటు మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సభ్యులు తెలిపారు. అలాగే అన్ని ఖర్చులు పోను దాదాపుగా నెలకు రూ.10 వేలకు మిగిలినట్లు సభ్యులు తెలిపారు.

వ్యాపారాన్ని మరింత విస్తరిస్తా



పొదుపు సంఘంలో తీసుకున్న అప్పు తీర్చిన తర్వాత మళ్లీ తిరిగి అప్పు తీసుకొని దాంతో మెస్‌ను ఏర్పాటు చేసి వ్యాపారాన్ని విస్తరించాలని ఉంది. అదే విధంగా నాతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించాలని ఉంది.

- విజయ,
భవానీ పొదుపు సంఘం సభ్యురాలు

అక్రమ వలసదారులపై పర్యవేక్షణ సాగించాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలో అక్రమ వలసదారులపై పర్యవేక్షణ సాగించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో డీఎస్పీ రాజశేఖరరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు వనం మదన్‌మోహన్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌తో పాటు బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి రోహింగ్యాలు పట్టణానికి అక్రమంగా వలసవచ్చి పలు విభాగాల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ధృవీకరణ పత్రాలు పరిశీలించాలని కోరారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు గుంపులుగా తిరుగుతున్నారని, మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చిలుకూరి శ్యాం, బొట్టు సోములు, బంటు గిరి, రాజశేఖర్ నాయక్, దుండిగాల కృష్ణయ్య, నేరెళ్ల అజయ్, పగడాల యాదగిరి, కొండల్, రమేష్ పాల్గొన్నారు.

యోగా శిక్షణ కేంద్రం ప్రారంభం

నార్కట్‌పల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్రఆయుష్ పథకంలో భాగంగా అమ్మనబోలు హోమియోపతి కేంద్రానికి అనుబంధంగా యోగా కేంద్రం మంగళవారం ప్రారంభమైంది. హోమియోపతి వైద్యురాలు మోబిన్ పర్వీన్ పర్యవేక్షణలో ఈ కేంద్రం నిర్వహించనున్నారు శిక్షకులు రావుల మధుసూదన్ యోగా శిక్షణను ప్రారంభించారు.

పౌష్టికాహారం అందజేత

శాలిగౌరారం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు మంగళవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ డాక్టర్ వాసంతి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దాతలు క్లబ్ సభ్యులు గుండు పరమేష్ - శివరాణి దంపతులు పీహెచ్ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్లు దయామణి, మరియా, క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

మునుగోడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇండ్లులేని సమస్యలను పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా కార్యదర్శి రాసమల్ల కృష్ణ, అన్నారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండ లాధ్యక్షుడు బుడగపాక లింగస్వామి, లక్ష్మయ్య, సైదులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో నిరుపేదలకు ఆసరా



చెక్కులను పంపిణీ చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

● *శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి*

నల్లగొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 67 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా రూ. 25.40లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దేవరకొండకు 200 పడకల ఆస్పత్రి మంజూరు

దేవరకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా మంజూరైనట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలూ నాయక్ తెలిపారు. ఆసుపత్రికి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కోసం శేరిపల్లి రోడ్డు, కొల్ముం తలపహడ్, ప్రభుత్వ ఆసుపత్రిలోని వెనుకభాగంలోని ప్రభుత్వ స్థలాలను ఆర్డీవో రమణారెడ్డి పాటు ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.50 కోట్లతో ఐదు ఎకరాలలో 200 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, గోవిందు, బిక్కునాయక్, పున్న వెంకటేశ్వర్లు, అధికారులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 200 మందికి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.28.60 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయిని



దేవరకొండలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలూ నాయక్

మాధవరెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఎండి.యూనుస్, పాల్గొన్నారు.

ఎరుగండ్లపల్లికి రోడ్డు మంజూరు చేయాలి

చింతపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోటిగడ్డ నుంచి ఎరుగండ్లపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బాలూనాయక్‌కు మాజీ సర్పంచి ఇస్లావత్ పద్మ పుల్ సింగ్ నాయక్ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ బీటీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామన్నారు.

మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ పరామర్శ

శాలిగౌరారం, నవంబరు 19,(ఆంధ్రజ్యోతి): మండలం లోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మామిడి సర్వయ్య సోదరి చంద్రమ్మ, భైరవునిబండ గ్రామానికి చెందిన మణికొండ రవి తండ్రి మణి కొండ యాదయ్య ఇటీవల మృతి చెందారు .తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మంగలవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తేజస్వీ, బీఆర్ఎస్ నాయకులు చాడ హతీష్ రెడ్డి, గుండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిరేకల్ బైపాస్‌లో మహిళా అఘోరా

నకిరేకల్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : నకిరేకల్ బైపాస్‌రోడ్డులో సోమవారం రాత్రి మహిళా అఘోరా సేద తీరారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కారులో నిద్రించారు. ఆమె అక్కడ ఉన్న విషయం తెలుసు కున్న నకిరేకల్ పోలీసులు అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. ఈ అడవిలో ఉంటే భద్రత కల్పించలేమని ఎస్సీ, ఇక్కడ నుంచి వెళ్లి పోవాలని పేర్కొన్నారు. దాంతో ఆమె స్పందించి ఇప్పటికే వేరే ప్రాంతాలు కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఏమైనా జరిగితే నా ప్రాణం తీసుకుంటారు. అంతకంటే ఏం జరుగుతుందని పోలీసులతో చెప్పారు. అనంతరం ఆమె హైదరాబాద్ వైపు వెళ్లారు.

సమాచారం

రేపు చెకుముకి పరీక్ష

తిరుమలగిరి(సాగర్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా గురువారం మండల స్థాయి పరీక్ష జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉంటుందని చెకుముకి జిల్లా కన్వీనర్ వంగూరి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. విద్యార్థులు పాఠశాల నుంచి జట్టుగా మండల స్థాయి పరీక్షకు హాజరుకావాలని ఆయన సూచించారు. ఉదయం 10 నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహించి వెంటనే ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. 9014966743 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మునుగోడు, మునుగోడురూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమా మిడి, పలివెల, ఊకొండిలోని 33కేవీ ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీగలు, స్తంభాలకు అడ్డుపెరిగిన చెట్ల కొమ్మలు తొలగించేందుకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వనభోజనాలు

చింతపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తమ్మలోనిగూడ సమీపంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా మల్లేష్

చిట్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శిగా పెద్దకాపర్తి గ్రామానికి చెందిన చేకూరి మల్లేష్ ఎన్నికయ్యారు. నల్లగొండలో ఈనెల 18న నిర్వాహించిన అసోసియేషన్ సమావేశంలో మల్లేష్‌ను రెండోసారి ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొలుగు రవి, రాష్ట్ర నాయకుడు నల్ల ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం కార్యదర్శుల ఎన్నిక

కేతేపల్లి,నవంబరు19(ఆంధ్రజ్యోతి): కేతేపల్లిలోని సీపీఎం రెండు శాఖలకు నూతన కార్యదర్శులను మంగళవారం ఎన్నుకున్నారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో కేతేపల్లి-1 శాఖ కార్యదర్శిగా వీరబోయిన సైదయ్య, కేతేపల్లి-2 శాఖ కార్యదర్శిగా బండమీది అంజయ్య ఎన్నికైనట్లు పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య తెలిపారు.

సీపీఎం మహా ప్రజా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 2న మిర్యాలగూడలో నిర్వహించే సీపీఎం మహా ప్రజా ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నార్కట్‌పల్లిలో ఆ పార్టీ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు చింతపల్లి బయ్యన్న, చెర్కు పెద్దులు, జాల యాదమ్మ, కొప్పు శ్రవణ్, అర్థం శ్రీనివాస్, సైదులు, అశోక్ పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం సదస్సును జయప్రదం చేయాలి

నకిరేకల్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ చట్టం భూ సంస్కరణలు కేంద్రం అమలు చేయాలని కోరుతూ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమురయ్య అన్నారు. రాష్ట్ర సదస్సు కరపత్రాన్ని నకిరేకల్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లెబోయిన జాని, సైదులు, బంటు రామ లింగం, శివయ్య, నరేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

● *జిల్లా వ్యాప్తంగా ఇందిరా గాంధీ జయంతి* ● *నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు*



నకిరేకల్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశంల



మిర్యాలగూడ : ఇందిరాగాంధీ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, తదితరులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : దేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని మంగళ వారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఆమె విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు చోట్ల కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ భవన్‌లో ఎమ్మెల్యే బీఎల్ఆర్ ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాలలు వేసి మాట్లాడారు. దేశానికి ఎనలేని సేవ చేసి దేశవ్యాప్తంగా నిరుపేద గుండెల్లో ఇందిరమ్మ నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్ పాల్గొన్నారు. దేవరకొండ వ్యవసాయ మార్కెట్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ మొట్టమొదటి మహిళ ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించిందన్నారు.

నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జుకూరి రమేష్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పాల్గొన్నారు. హాలియాలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. మర్రిగూడ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ పూల మాల వేసి నివాళులర్పించారు. వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి

నల్లగొండ కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలని టీఎస్‌ఈడబ్ల్యూ డివిజన్ ఇంజినీర్ శైలజ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సరస్వతి దేవి, ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సార్థకత ఉంటుందని అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుధారాణి, మత్స్యశాఖ అధికారి చరిత సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వినోద్‌రెడ్డి, మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఉపాధ్యాయులు పద్మకుమారి, సునిత, నిర్మలా దేవి, శ్రీదేవి, గ్రంథపాలకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ నంబర్ ఎప్పుడూ స్విచ్ఛాఫ్

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. ఈమేరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల నమోదు, వాటి పరిష్కారం కోసమే సుమారు రెండేళ్ల క్రితం నల్లగొండ పట్టణంలోని ఏడీఈ కార్యాలయ ఆవరణలో ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో ముగ్గురు ఆర్టిజన్లకు ఒక్కొక్కరు 8గంటలు పని చేసేలా చార్ట్ తయారు చేసి 24గంటలు వినియాగదారులకు అందుబాటులో ఉండేలా సెల్: 94910 65747ను కేటాయించారు. వినియోగదారులు సరఫరా నిలిచిపోతే సంబంధిత కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినట్లయితే సదరు సిబ్బంది వారి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత సెక్షన్, ఏరియా లైన్‌మెన్‌కో ఏఎల్ఎంకో, జేఎల్ఎంకో తెలియజేసి సమస్య పరిష్కారమయ్యేలా చొరవ తీసుకునేవారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేసేవారు. అయితే ప్రస్తుతం ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఎత్తివేయడంతో వినియోగదారులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఫ్యూజ్ ఆఫ్ కాల్ వ్యవస్థను పునరుద్ధరిస్తాం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్ అనేది మంచి వేదిక. నేను ఇటీవలే బదిలీపై ఇక్కడికి రావడం వల్ల నల్లగొండ పట్టణంలో ఈ వ్యవస్థ పనిచేయడం లేదన్న విషయం నాకు తెలియదు. అధికారులతో మాట్లాడి వాస్తవాలను పరిశీలించి ఫ్యూజ్ ఆఫ్‌కాల్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటాం. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో రాజీపడే ప్రసక్తి లేదు.

ఎం.వేణుగోపాలచార్యులు, ఏడీఈ,